సాక్షి
వికారాబాద్

మంగళవారం । 21 । మార్చి । 2023



ఇలా చదివేద్దాం..
ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని పదో తరగతి విద్యార్థులకు నిపుణుల సూచిస్తున్నారు. 8లో▸



ప్రజలకు వివరిద్దాం
రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిద్దామని ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి అన్నారు. 8లో▸



అంచనాలే తప్ప..
పంట నష్టంపై అంచనాలే తప్ప.. రైతులకు హామీ ఇవ్వడంలేదని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ప్రసాద్‌కుమార్ అన్నారు. 9లో▸

న్యూస్‌రీల్

భక్తుల ఇంటికే రాములోరి తలంబ్రాలు



డీడీలు స్వీకరిస్తున్న ఆర్టీసీ అధికారులు

కుల్కచర్ల: భద్రాచలంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే సీతారాముల కల్యాణోత్సవ తలంబ్రాలను భక్తుల ఇంటికే అందించేందుకు ఆర్టీసీ సంస్థ ఏర్పాట్లు చేస్తున్నదని పరిగి ఆర్టీసీ డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ విశ్వనాథం గౌడ్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో పలువురు భక్తుల నుంచి తలంబ్రాలు పొందేందుకు రూ.116 డీడీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భక్తులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఘణపురం వెంకటయ్య, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

మగ్గం తయారీలో ఉచిత శిక్షణ

ధారూరు: గ్రామీణ ప్రాంత మహిళలకు స్వయం ఉపాధి సంస్థ ద్వారా ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు స్వయం ఉపాధి సంస్థ చిలుకూరు సంచాలకులు కె. రమేష్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహిళలకు మగ్గం వర్క్, బ్యూటీ పార్లర్, టైలరింగ్ లో, అలాగే పురుషులకు మొబైల్, టూవీలర్, సీసీటీవీ, కెమెరాల రిపేరింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు. 19 నుంచి 45 సంవత్సరాల వయస్సు కలిగిన వారు అర్హులని చెప్పారు. దరఖాస్తుదారులు విధిగా వికారాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలకు చెందిన వారై ఉండాలనీ ఆయన సూచించారు. ఉచిత శిక్షణ కాలపరిమితి 30 రోజులు ఉంటుందన్నారు. శిక్షణ సమయంలో ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తారన్నారు. ఆసక్తి కలిగిన వారు 86390 79122, 79819 51167 నంబర్లను సంప్రదించి పేరు నమోదు చేసుకోవాలన్నారు.

రూ.5.90లక్షలకు తైబజార్ వేలం

కొడంగల్ రూరల్ : పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం జరిగిన వేలం పాటలో రూ.5.90 లక్షలకు తైబజార్‌ను పట్టణానికి చెందిన నీలకంఠ దక్కించుకున్నారు. మున్సిపల్ చైర్మన్ ఆర్.జగదీశ్వర్‌రెడ్డి అధ్యక్షతన కమిషనర్ ప్రవీణ్‌కుమార్, మున్సిపల్ సిబ్బంది తైబజార్‌కు సంబంధించి వేలం నిర్వహించారు. నీలకంఠ అధికంగా వేలం పాడుతూ తైబజార్‌ను దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పర్యాటకులను అడ్డగిస్తే 100కు డయల్ చేయండి



ఏఎస్పీ మురళీధర్

అనంతగిరి: అనంతగిరి గుట్టకు వచ్చే పర్యాటకులను అడ్డగించినా, ఇబ్బందులకు గురిచేసినా కఠినమైన చర్యలు తీసుకుంటామని జిల్లా అదనపు ఎస్పీ మురళీధర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వికారాబాద్ సమీపంలోని అనంతగిరికి ఇతర ప్రాంతాల నుంచి వందలాదిగా పర్యాటకులు వస్తుంటారన్నారు. అడవి ప్రాంతం ఉన్నందున కొందరు ఆకతాయిలు పర్యాటకులను ఇబ్బంది పెడుతున్నట్లు తెలుస్తోందన్నారు. ఎంతటివారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. ఆకతాయిల నుంచి ఎమైనా ఇబ్బంది ఏర్పడితే వెంటనే డయల్ 100కు ఫోన్ చేసి తెలపాలన్నారు. పర్యాటకులు ఒంటరిగా అడవి ప్రాంతాల్లోకి వెళ్లవద్దని సూచించారు.

వీధి కుక్కలను అరికట్టండి



కలెక్టర్‌కు వినతి పత్రం అందిస్తున్న వైస్ చైర్‌పర్సన్ దీపానర్సింహులు

తాండూరు: మున్సిపాలిటీలో వీధికుక్కలను అరికట్టాలంటూ తాండూరు మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ పట్లోళ్ల దీప కలెక్టర్ నారాయణరెడ్డికి విన్నవించారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. మున్సిపల్ పరిధిలో వీధికుక్కలు అధికమయ్యాయని వాటిని అరికట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం తాండూరు మున్సిపల్ పరిధిలో నెలకొన్న సమస్యలపై మాట్లాడారు.

చిన్న శేషవాహనంపై బ్రహ్మాండనాయకుడు

కొడంగల్ పట్టణంలో పేదల తిరుపతిగా పేరుగాంచిన మహాలక్ష్మి వేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం మూడో రోజు స్వామివారు చిన్నశేషవాహనంపై నుంచి భక్తులకు దర్శనమిచ్చారు. భక్తజన సందోహం మధ్య మంగళ వాయిద్యాలు.. గోవింద నామస్మరణలతో పురవీధుల్లో స్వామివారి ఊరేగింపు కొనసాగింది. అనంతరం ఆస్థాన మండపంలో కొలువుదీరగా భక్తులు మంగళహారతులు పట్టారు. మధ్యాహ్నం ఉత్సవ మూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. సుగంధ ద్రవ్యాలతో విశేషంగా అభిషేకం నిర్వహించారు. తులసి మాలలు, విశేష పూలతో అలంకరించారు. పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

– కొడంగల్ రూరల్



చిన్న శేషవాహనంపై స్వామివారిని ఊరేగిస్తున్న భక్తులు (ఇన్‌సెట్‌లో) విశేష అలంకరణలో ఉత్సవమూర్తులు

భర్త ఇంటి ఎదుట బైఠాయింపు

- వివాహేతర సంబంధం పెట్టుకుని పట్టించుకోవడంలేదని నిరసన
- న్యాయం చేయాలని వేడుకోలు



నిరసన తెలుపుతున్న భార్య

పరిగి: న్యాయం చేయాలంటూ భర్త ఇంటి ఎదుట భార్య ఆందోళనకు దిగింది. ఈ ఘటన పరిగి మండలంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. తొండుపల్లికి చెందిన కుర్వ శ్రీశైలం హైదరాబాద్‌లోని మాదాపూర్ డీసీపీ కార్యాలయంలో ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. మిట్టకోడూరు గ్రామానికి చెందిన అనితతో నవంబర్ 2021న వివాహం జరిగింది. శ్రీశైలం విధులు నిర్వహించే కార్యాలయంలో ఓ లేడీ కానిస్టేబుల్‌తో వివాహేతర సంబంధం పెట్టుకుని నన్ను పట్టించుకోవడంలేదని భార్య అనిత ఆరోపిస్తున్నారు. ఈక్రమంలో పలుమార్లు పంచాయితీ పెట్టినా తీరులో మార్పురావడంలేదని అన్నారు. సోమవారం కూడా మరోసారి పంచాయితీ పెట్టి మాట్లాడగా 'లేడీ కానిస్టేబుల్‌ను ప్రేమిస్తున్నాను. . నీవు అవసరం లేద'ని చెప్పడంతో ఇంటి ఎదుట ఆందోళనకు దిగినట్లు అనిత తెలిపారు. తనకు న్యాయం చేసేవరకు ఆందోళన విరమించేదిలేని భీష్మించి భర్త ఇంటి ఎదుట బైఠాయించింది. ప్రస్తుతం తాను నాలుగు నెలల గర్భవతిని అని, ఇబ్బందులకు గురి చేస్తున్న భర్తపై చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

ఐక్యరాజ్యసమితి మీట్‌లో 'దళితబంధు'

- ప్రస్తావించిన జిల్లా వాసి
- భారత్ తరఫున పాల్గొన్న ఈకో–ఫాన్ ఫౌండర్ సాయిసంపత్



ఐక్యరాజ్యసమితిలో మాట్లాడుతున్న మెట్టు సాయి సంపత్

బషీరాబాద్: మండలానికి చెందిన ఓ యువకుడు జెనీవాలో జరుగుతున్న ఐక్యరాజ్యసమితి 52వ మానవ హక్కుల మండలి సమావేశంలో భారత తరఫున పాల్గొన్నారు. గత నెల 27 నుంచి ఈ నెల 17 వరకు జరిగిన ప్రపంచ మానవ హక్కుల పరిరక్షణ అనే అంశంపై ఈకో– ఫాన్ ఫౌండర్‌గా ఉన్న బాద్లాపూర్‌కు చెందిన మెట్టు సాయి సంపత్ ప్రజంటేషన్ ఇచ్చి ఆకట్టుకున్నారు. భారత్‌లోనే మానవ హక్కుల పరిరక్షణ మెరుగ్గా ఉందని అంతర్జాతీయ వేదికపై వెలుగెత్తి చాటారు. ఇండియాలో అణగారిన దళితులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయని నివేదిక సమర్పించారు. మధ్యప్రదేశ్‌లో ఆ రాష్ట్ర ప్రభుత్వం ఒక దళిత విద్యార్థికి కోటి రూపాయల స్కాలర్‌షిప్ అందించిందని తెలిపారు. అలాగే తెలంగాణలో దళితుల అభివృద్ధికి ప్రభుత్వం దళిత బంధు పథకంతో ఒక్కో దళితుడికి రూ.10లక్షల ఆర్థిక సాయం అందిస్తోందని ప్రస్తావించారు. తాను ఈకో ఫాన్ స్వచ్ఛంద సంస్థ తరఫున పర్యావరణ పరిరక్షణ, జంతు రక్షణవంటి సామాజిక అంశాలపై పనిచేస్తున్నట్లు వివరించారు. సోమవారం తిరిగి వచ్చిన సంపత్‌ను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.

వినతుల వెల్లువ

'ప్రజావాణి'కి జనం బారులు
- వందలాదిగా ఫిర్యాదులు
- కలెక్టరేట్‌కు 398 దరఖాస్తులు
- సమస్యలన్నీ పరిష్కరిస్తాం
- పనిచేసే వీఆర్‌ఏలకే వేతనాలు
- కలెక్టర్ నారాయణరెడ్డి వెల్లడి



కలెక్టరేట్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్ : కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న 'ప్రజావాణి'కి వినతులు వెల్లువెత్తుతున్నాయి. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి దరఖాస్తుదారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆయా సమస్యల పరిష్కారం కోసం వస్తున్న దరఖాస్తుదారులతో కలెక్టరేట్ ప్రాంగణం కిటకిటలాడింది. ఉదయం నుంచే వందలాది మంది బారులు తీరారు. గతంలో అనేక సార్లు మీసేవా కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకున్నా పరిష్కారానికి నోచుకోకపోవడంతో విసిగి వేసారిన అర్జీదారులు నూతన కలెక్టర్ రాకతో మళ్లీ వారిలో ఆశలు చిగురించాయి. తిరిగి దరఖాస్తు చేసుకునేందుకు క్యూ కడుతున్నారు.

రెండు స్థాయిల్లో..
రెండు స్థాయిల్లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నారు. తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. మండల స్థాయిలో పరిష్కారం కాకపోతే అర్జీదారులు కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణికి వస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో 398 దరఖాస్తులు వచ్చాయి. ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కలెక్టర్ నేరుగా ఈ దరఖాస్తులు స్వీకరించారు. ఆయన పరిధిలో ఉన్న దరఖాస్తులు అక్కడే పెట్టుకుని మిగతావి ఆయా శాఖల జిల్లా అధికారులను పిలిచి అప్పగించారు. ప్రధానంగా ఇందులో ఎక్కువ శాతం ధరణి దరఖాస్తులు ఉన్నాయి. డీపీఓ, పింఛన్లు, రేషన్ కార్డులు, సదరం సర్టిఫికెట్లు, వ్యవసాయం తదితర దరఖాస్తులు సైతం వచ్చాయి.



కలెక్టరేట్‌లో బారులుతీరిన అర్జీదారులు

విధులకు హాజరుకాని వీఆర్‌ఏలపై చర్యలు

పనిచేసే వీఆర్‌ఏలకే వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ నారాయణరెడ్డి తహసీల్దార్లను ఆదేశించారు. విధులకు ఎగనామం పెట్టే వీఆర్‌ఏలకు ఎట్టి పరిస్థితిలోనూ ఉపేక్షించేది లేదన్నారు. విధులకు హాజరు కాని వీఆర్‌ఏల వేతనాలు నిలిపి వేసి, తగు చర్యల కోసం ఆర్డీఓలకు నివేదిక అందజేయాలని ఆయన సూచించారు. ఇదే సమయంలో బాగా పని చేసే వీఆర్‌ఏలకు సకాలంలో పూర్తి వేతనాలు అందేలా చూడాలన్నారు. ప్రజావాణి కార్యక్రమానికి వచ్చే ఫిర్యాదుల్లో కోర్టు పరిధిలోనివి, పాలసీ మ్యాటర్స్‌కి సంబంధించినవి కాకుండా పరిష్కారానికి అవకాశం ఉన్న ప్రతి దరఖాస్తును పరిష్కరిస్తామన్నారు.

యూత్ కాంగ్రెస్ కలెక్టరేట్ ముట్టడి

- టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీని నిరసిస్తూ ఆందోళన
- అడ్డుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించిన పోలీసులు
- అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు: సతీష్‌రెడ్డి



ఆందోళనకారులను అడ్డుకుంటున్న పోలీసులు

అనంతగిరి: యూత్‌కాంగ్రెస్ నాయకులు సోమవారం కలెక్టరేట్‌ను ముట్టడించారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీని నిరసిస్తూ యూత్ కాంగ్రెస్ నాయకులు ఆందోళనకు దిగారు. కలెక్టరేట్ ప్రధాన గేటులోంచి లోపలికి వెళ్తున్న నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఉద్యమకారులు తీవ్రంగా ప్రతిఘటించారు. స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. కొందరు గేట్ పైకి ఎక్కి వెళ్లేందుకు యత్నిస్తుండగా పోలీసులు అడ్డుకుని అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సతీశ్‌రెడ్డి మాట్లాడుతూ అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని మండిపడ్డారు. ఓవైపు తప్పు చేసిన ప్రభుత్వాన్ని న్యాయం అడిగితే అక్రమ అరెస్టులు చేయించడం సబబుకాదన్నారు. నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న ఈ ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. మంత్రి కేటీఆర్ బాధ్యత వహిస్తూ పదవి నుంచి తప్పుకోవాలన్నారు. బీఆర్ఎస్ పాలనలో విద్యార్థులకు, నిరుద్యోగులకు తీరని అన్యాయం జరుగుతోందని మండిపడ్డారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాల్సిందే

- పేపర్ లీకేజీలో గుట్టు విప్పాల్సిందే
- డాక్టర్ చంద్రశేఖర్ డిమాండ్
- వికారాబాద్‌లో బీజేపీ శ్రేణుల నిరాహారదీక్ష

వికారాబాద్ అర్బన్: పేపర్ లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపడితేనే అన్ని విషయాలు బయటకు వస్తాయని బీజేపీ సీనియర్ నాయకుడు డాక్టర్ ఏ. చంద్రశేఖర్ అన్నారు. బీజేపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు సోమవారం వికారాబాద్ ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రూప్–1 ఉద్యోగాల్లో బీఆర్ఎస్ జెడ్పీటీసీ, సర్పంచ్, సింగిల్ విండో చైర్మన్ల పిల్లలు, బంధువులు మాత్రమే అర్హత సాధించినట్లు ఆరోపించారు. ఒకే మండలానికి చెందిన 50మంది ఎలా ఎంపికయ్యారో మంత్రి కేటీఆర్ రాష్ట్ర ప్రజలకు, నిరుద్యోగులకు వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పేపర్ లీకేజీకి వంద శాతం కేటీఆర్ బాధ్యుడని ఆరోపించారు. రూ.3 లక్షల నుంచి 5లక్షలకు ఉద్యోగాలను అమ్ముకున్నట్లు తెలిపారు. ఈ విషయంపై తక్షణం కేటీఆర్‌ను భర్తరఫ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పేపర్ లీకేజీపై విచారణకు నియమించిన సిట్ కేవలం కాలయాపన చేసేందుకేనని విమర్శించారు. 40 లక్షల మంది నిరుద్యోగుల జీవితాలతో ఆడుకున్న కేసీఆర్‌కు పాలించే అర్హత లేదన్నారు. వారిని తెలంగాణ సమాజం వదిలిపెట్టదన్నారు. నిరుద్యోగుల తరఫున కొట్లాడేందుకు బీజేపీ సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు టి. సదానంద్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పాండుగౌడ్, రాజేందర్‌రెడ్డి, రాఘవన్ నాయక్, సుచరితారెడ్డి, కౌన్సిలర్ శ్రీదేవి, శివ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



దీక్షలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

4 కిలో మీటర్లు.. 30 నిమిషాలు

రోడ్డంతా కంకర..
- బిక్కుబిక్కుమంటూ ప్రయాణం
- రోడ్డుపనులను అర్ధంతరంగా వదిలేసిన కాంట్రాక్టర్
- అవస్థలు పడుతున్న గ్రామీణులు
- పట్టించుకోని పంచాయతీరాజ్ శాఖ అధికారులు



కంకరవేసి వదిలేసిన పర్వతాపూర్ రోడ్డు

తాండూరు రూరల్: తాండూరు పట్టణానికి అతి సమీపంలో ఉన్న గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేక అవస్థలు తప్పడంలేదు. పనులు దక్కించుకున్న సదరు కాంట్రాక్టర్ కంకరవేసి మధ్యలో నిలిపేశారు. గ్రామీణులు తీవ్ర ఇబ్బంది పడుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. తాండూరు మండలం పర్వతాపూర్ గ్రామానికి ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన పథకం (పీఎంజీఎస్‌వై) కింద డబుల్ రోడ్డుకు రూ.2 కోట్లు మంజూరు అయ్యాయి. గౌతాపూర్ నుంచి పర్వతాపూర్ వరకు 4 కిలో మీటర్ల వరకు రోడ్డు నిర్మిస్తున్నారు. ఏడాది క్రితం పనులు ప్రారంభమయ్యాయి. పనులు దక్కించుకున్న సదరు కాంట్రాక్టర్ కంకర వేసి వదిలేశారు. ఈ రోడ్డు గుండా ప్రయాణించాలంటే నాలుగు కిలోమీటర్లకు 30 నిమిషాలకు పైగా పడుతోందని చెంగోల్, చింతమణిపట్నం, పర్వతాపూర్, గిర్మాపూర్, జైరాంతండా ప్రజలు వాపోతున్నారు.

పత్తాలేని కాంట్రాక్టర్
చెంగోల్ నుంచి పర్వతాపూర్ వరకు సింగిల్ రోడ్డు ఉంది. రోడ్డుపై వాహనాల రాకపోకలు సాగాయి. అయితే పీఎంజీఎస్‌వై కింద డబుల్ రోడ్డు మంజూరు కావడంతో.. మంచిగా ఉన్న రోడ్డును కాంట్రాక్టర్ తవ్వేశారు. ఆ తర్వాత రోడ్డు త్వరగా పూర్తి చేయాల్సి ఉండగా కంకరవేసి వదిలేశారు. దీంతో రోజూ ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. కంకరరోడ్డుపై ప్రయణికులు అవస్థలు పడుతున్నా సదరు కాంట్రాక్టర్ స్పందించకపోవడం గమనార్హం. ఇప్పటికైనా సంబంధిత పంచాయతీరాజ్ అధికారులు చొరవచూపి.. పర్వతాపూర్ రోడ్డును వెంటనే పూర్తి చేయాలని కోరుతున్నారు.

ఆందోళన చేపడతాం



మా గ్రామానికి వెళ్లే రోడ్డు మొదట బాగానే ఉండేది. డబుల్ రోడ్డు మంజూరు కావడంతో రోడ్డును తవ్వేశారు. అ తర్వాత కంకరవేసి వదిలేశారు. యేడాది క్రితం కంకరవేసి వదిలేయడంతో అప్పటి నుంచి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్రవాహనాలు అదుపుతప్పిపడిపోతున్నాయి. వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించకుంటే ఆందోళనకు దిగుతాం.

– లాల్‌రెడ్డి, సర్పంచ్, పర్వతాపూర్

బిల్లులు రాకపోవడంతో..



చెంగోల్ నుంచి పర్వతాపూర్ వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి రూ.2 కోట్లు మంజూరయ్యాయి.సెంట్రల్ క్వాలిటీ కంట్రోల్ అధికారులు కూడా తనిఖీ చేశారు. ప్రస్తుతం చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతోనే కాంట్రాక్టర్ పనులు మధ్యలో నిలిపివేశారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి రోడ్డు పనులు త్వరగా పూర్తి చేసేవిధంగా కృషి చేస్తాం.

– నందిని, ఏఈ, పంచాయతీరాజ్ విభాగం, తాండూరు

క్లుప్తంగా

'కంటి వెలుగు'ను సందర్శించిన ఎమ్మెల్యే



కంటి వెలుగు రికార్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆనంద్

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని బాలకేంద్రం ఆవరణలో జరుగుతున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కంటి పరీక్షలపై సిబ్బందితో చర్చించారు. సీఎం కేసీఆర్ ముందు చూపుతోనే కంటి వెలుగు పథకం ఆవిష్కరణ జరిగిందన్నారు. కంటి చూపు మందగించిన ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అపహరణకు గురైన లారీ సిద్దిపేటలో స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న లారీ

తాండూరు టౌన్: పట్టణంలో చోరీకి గురైన లారీ సోమవారం సిద్దిపేటలో లభించింది. నర్సింహారెడ్డికి చెందిన లారీని శనివారం తాండూరులోని లారీ పార్కింగ్‌లో ఉండగా అర్ధరాత్రి చోరీకి గురైన విషయం తెలిసిందే. సీసీ పుటేజీని పరిశీలించిన పోలీసులు ఆ దిశగా దర్యాప్తు ప్రారంభించారు. సిద్దిపేటలో రోడ్డు పక్కన నిలిపి నిందితుడు పరారయ్యాడు. పోలీసులు లారీని స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ రాజేందర్‌రెడ్డి తెలిపారు.

బాలికపై కుక్క దాడి



కుక్క దాడిలో గాయపడిన బాలిక

తాండూరు టౌన్: బాలికపై కుక్క దాడి చేసి గాయపరిచిన ఘటన సోమవారం తాండూరులో చోటు చేసుకుంది. స్థానికులు కుక్కను తరిమేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. వివరాలు ఇలా ఉన్నాయి.. పాత తాండూరులోని కర్బలా మైదాన్ ప్రాంతానికి చెందిన నాలుగేళ్ల బాలిక అంగన్‌వాడీ పాఠశాలకు వెళుతోంది. అదే సమయంలో వీధి కుక్క బాలికపై దాడి చేసింది. పాప అరుపులు విన్న స్థానికులు కుక్కను తరిమేశారు. బాలికను తల్లిదండ్రులు తాండూరు ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. పిల్లలపై కుక్కలు దాడి చేస్తున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే కుక్కలను బంధించాలని వారు డిమాండ్ చేశారు.

ఇలా చదివేద్దాం.. అలా పాసవుదాం..

- ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు
- పరీక్షల భయం వీడాలి
- పదో తరగతి విద్యార్థులకు నిపుణుల సూచనలు, సలహాలు

నవాబుపేట: ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని పదో తరగతి విద్యార్థులకు నిపుణుల సూచిస్తున్నారు. ఈ ఏడాది పదో తరగతిలో కొత్తగా ఆరు పేపర్లతో పరీక్షలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. సిలబస్ మాత్రం పూర్తిగా చదవాలి. కానీ రాయాల్సిన పరీక్షల సంఖ్య తగ్గించారు. కొత్త విధానంపై సరైన అవగాహన, ప్రణాళికతో సాగితే మెరుగైన ఫలితాలు సాధించవచ్చని నిపుణులు అంటున్నారు. 2022 – 23 వార్షిక పరీక్షలు ఏప్రిల్ 3 నుంచి 11వ తేదీ వరకు నిర్వహించనున్నారు. పరీక్షల సమయం దగ్గర పడుతుండడంతో విద్యార్థులు ఒత్తిడి ఎదుర్కొనే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో వారిలో ఎదురయ్యే సందేహాలను నివృత్తి చేసే ప్రయత్నంలో భాగంగా పులువురు ఉపాధ్యాయులు సలహాలు, సూచనలు ఇస్తున్నారు.



నవాబుపేట జెడ్పీహెచ్‌ఎస్‌లో ప్రత్యేక తరగతులు

గణితం



విద్యార్థులు ముందుగా గణితంపై భయం వీడాలి. సిలబస్‌పై పూర్తి అవగాహన ఉంటే భయం పోతుంది. సంఖ్యా వ్యవస్థ, బీజ గణితం, నిరూపక రేఖాగణితం, రేఖా గణితం, క్షేత్రమితి, త్రికోణమితి, సంభావ్యత, సంఖ్యాశాస్త్రం అధ్యాయాలపై సంపూర్ణ అవగాహన పెంచుకోవాలి. కారణాల నిరూపన, వ్యక్తీకరణ, ఒక సమస్యను ఇతర అంశాలతో అనుసంధానం చేయడంలో గట్టి పట్టు సాధించాలి. ముఖ్యమైన నిర్వచనాలు, సూత్రాలు బాగా గుర్తుంచుకోవాలి. పాఠ్యాంశం చివరలో పేర్కొనే సమస్యలన్నీ సాధన చేయాలి. గ్రాఫ్‌లు, నిర్మాణాల సమస్యలకు సమాధానాలు కనుగొనడంపై ఎక్కువ సాధన చేయాలి. – పాండు, గణిత ఉపాధ్యాయుడు, నవాబుపేట జెడ్పీహెచ్‌ఎస్

ఆంగ్లం

తెలుగు మీడియం విద్యార్థులు ముందుగా భయం వీడాలి. జాగ్రత్తగా ఆలోచిస్తే గణితం చాలా సులువు. పార్ట్ ఏ, బీ, సీ సెక్షన్లపై అవగాహన పెంచుకోవాలి. అక్షర దోషాలపై దృష్టి పెట్టాలి. టెక్స్ ఇండిపెండింట్, ఇండిపెండింట్ అంశాలపై విద్యార్థులు పట్టు సాధించాలి. ఉదాహరణకు లేబుల్స్, పైడయా గ్రామ్స్, బార్ డయా గ్రామ్స్‌పై చార్ట్స్ తదితర అంశాలపై సాధన చేయాలి. పాఠ్యాంశాలు సొంతంగా విశ్లేషించగలగాలి. పాఠ్యాంశాన్ని గ్రహించి సొంతంగా నోట్స్ రాసుకోవడం మంచిది. పద్య భాగంలో ముఖ్య పదాలు యాంటినిమ్స్, సినానిమ్స్‌పై దృష్టి పెట్టాలి. వీటితో పాటు పార్ట్ ఆఫ్ స్పీచ్, డైరెక్ట్, ఇన్ డైరెక్ట్ స్పీచ్, యాక్టివ్ వాయిస్, వ్యాసాలు చదవాలి. – విజయకుమారి, మోడల్ స్కూల్, ఇంగ్లిష్ ఉపాధ్యాయురాలు

తెలుగు



ప్రణాళికతో చదివితే మంచి మార్కులు సాధించవచ్చు. పేరాగ్రాఫ్ రైటింగ్‌లకు 15 మార్కులు ఉంటాయి. వాటిని బాగా సాధనచేయాలి. 3మార్కుల ప్రశ్నలు 4 ఉంటాయి. కవి పరిచయాలు బాగా చదవాలి. వ్యాస రూప ప్రశ్నలు.. ఒక్కో ప్రశ్నకు 7మార్కులు, 3జవాబులు రాయాలి. దానాశీలం, వీర తెలంగాణ, జీవనం భాష్యం, భిక్ష పాఠాల సారాంశాల బాగా చదవాలి. సృజనాత్మకత ప్రశ్నకు 7 మార్కులు ఉంటాయి. – సురేష్, తెలుగు ఉపాధ్యాయుడు, గంగ్యాడ, జెడ్పీహెచ్‌ఎస్

భౌతిక శాస్త్రం



ప్రయోగ సమాచార సేకరణలో నైపుణ్యాలు, బొమ్మలు, నిత్య జీవితంలో వినియోగం తదితర అంశాలపై విద్యార్థులు ప్రత్యేక దృష్టి సారించాలి. పాస్ట్ (ఏ) అంశాలను అప్లికేషన్స్‌ఇప్రోచ్‌తో చదవాలి. చాప్టర్లను నిజ జీవిత సంఘటనలతో అన్వయించాలి. విషయ అవాహనతో పాటు ప్రశ్నించడం, పరికల్పన చేయడం.. ప్రాజెక్టు పనుల పటాల ద్వారా భావ ప్రసావం వంటి అంశాలపై లోతైన అధ్యయనం చేయాలి. – విఠలయ్య, భౌతికశాస్త్రం ఉపాధ్యాయుడు, నారెగూడ జెడ్పీహెచ్‌ఎస్

సాంఘిక శాస్త్రం



తేలికైన వాటిని ముందుగా చదివి, కఠిన అంశాలను బాగా సాధన చేయాలి. పట నైపుణ్యాలు, సమాచార నైపుణ్యాలు.. ప్రశంస – సున్నితత్వం, ఇచ్చిన అంశాన్ని చదివి వ్యాఖ్యాలు రాయడంపై సాధన చేయాలి. పటాలు, పట్టికలు, గ్రాఫ్‌లపై పట్టు పెంచుకుంటే ఎక్కువ మార్కులు సాధించవచ్చు. పాత ప్రశ్న పత్రాలు పలుమార్లు పరిశీలించుకోవాలి. అభ్యాస దీపికలోని అంశాలను బాగా చదవాలి. – నర్సింలు, సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుడు, చించల్‌పేట జెడ్పీహెచ్‌ఎస్

జీవశాస్త్రం



ఇది పార్ట్ బీ ప్రశ్న పత్రం. సమయం గంటన్నర ఇస్తారు. ఈ సబ్జెక్టులో విషయ అవగాహన, స్వీయ విశ్లేషణ, నైపుణ్యాలు అవసరం. అంశాల వారి చార్ట్‌లు, బ్లాక్ డయాగ్రామ్స్ సొంతంగా రూపొందించుకోవాలి. విశ్లేషణాత్మక, తులనాత్మక అధ్యయనానికి ప్రాధాన్యత ఇవ్వాలి. వాస్తవిక పరిస్థితులకు అన్వయిస్తూ పఠనం సాగాలి. ప్రయోగ నిర్వహణ ప్రక్రియపై ఎంత పట్టు ఉంటే అన్ని మార్కులు వస్తాయి. డయాగ్రామ్‌లోని భాగాలను గుర్తించడానికి పరిమితం కాకుండా ప్రాధాన్యాన్ని విశ్లేషించగలగాలి. – గోపాల్, ఎంఈఓ, జీవశాస్త్రం టీచర్, చిట్టిగిద్ద జెడ్పీహెచ్‌ఎస్

హిందీ

పార్ట్ ఏలో 6 మార్కులు ఉంటాయి. పేరాగ్రాఫ్‌కు 30 మార్కులు ఉంటాయి. దాన్ని చదివి అర్థం చేసుకొని సమాధాలు ఇస్తే చాలు. సృజనాత్మకతను పరీక్షించే లేదా రచన, వ్యాసాలు, సాక్షాత్కార్, కరపత్, పోస్టర్ అంశాలను బాగా చదవాలి. భాషా దోషాల్లేకుండా అందంగా రాయగలగాలి. పార్ట్ బీలో వ్యాకరణాలు ఉంటాయి. ప్రశ్నలు బహుళైచ్ఛిక రూపంలో ఉంటాయి. – సరిత, హిందీ ఉపాధ్యాయురాలు, నారెగూడ, జెడ్పీహెచ్‌ఎస్

కార్యకర్తలు సైనికుల్లా శ్రమించాలి



దౌల్తాబాద్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి



కొడంగల్ రూరల్: సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న సెర్ప్ ఉద్యోగులు

ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

దౌల్తాబాద్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిద్దామని ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని గుండేపల్లి వీరబద్రేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో బీఆర్‌ఎస్ మండల కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని అన్నారు. రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రతి కార్యకర్తా సైనికుడిలా పని చేయాలన్నారు. ప్రభుత్వంపై కాంగ్రెస్, బీజేపీలు లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని, వాటిని తిప్పికొట్టాలని సూచించారు. 40 ఏళ్లు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఇప్పుడు రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని మోసపూరిత మాటలు చెబుతోందని, వాటిని ప్రజలు నమ్మవద్దని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మహిపాల్, ఎంపీపీ విజయ్‌కుమార్, వైస్ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ప్రమోద్ రావు, నాయకులు మోహన్‌రెడ్డి, భీములు, శ్రీకాంత్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, నరోత్తంరెడ్డి ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సెర్ప్ ఉద్యోగులకు శుభాకాంక్షలు

కొడంగల్ రూరల్: సెర్ప్ ఉద్యోగులకు ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని 5మండలాల సెర్ప్ ఉద్యోగులు సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కేక కట్ చేసి తినిపించుకున్నారు.

ఉచితంగా బ్రాడ్ బ్యాండ్ కనెక్షన్లు

బీఎస్‌ఎన్‌ఎల్ రాష్ట్ర రూరల్ డీజీఎం జితేందర్ సింగ్

ధారూరు: ఉద్యమీ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఉచితంగా బీఎస్‌ఎన్‌ఎల్ బ్రాడ్ బ్యాండ్, ల్యాండ్ లైన్ కనెక్షన్లు ఇస్తున్నట్లు ఆ శాఖ రాష్ట్ర రూరల్ డీజీఎం జితేందర్ సింగ్ పేర్కొన్నారు. గతంలో ధారూరులో ఉద్యమీ ప్రాజెక్టు కింద అటవీ శాఖ ఎఫ్ఆర్ఓ కార్యాలయాలకు ఉచిత కనెక్షన్లు ఇచ్చారు. సోమవారం వాటిని ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రస్తుతం బీఎస్‌ఎన్‌ఎల్ ద్వారా అందుతున్న సేవలు ఏ విధంగా ఉన్నాయి, గతంలో ఏ నెట్‌వర్క్‌ను వాడే వారు అని అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీఎస్‌ఎన్‌ఎల్ ఉద్యమీ ప్రాజెక్టు కింద జిల్లాలోని ధారూరు, పూడూర్ మండలాల్లోని గ్రామీణ ప్రాంతాలకు బీఎస్‌ఎన్‌ఎల్ బ్రాడ్ బ్యాండ్, ల్యాండ్ లైన్ కనెక్షన్లు ఉచితంగా ఇస్తున్నట్లు ఆయన వివరించారు. కనెక్షన్లు తీసుకున్న వారు నెల వారి ప్లాన్ ప్రకారం బిల్లు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ కనెక్షన్ల ద్వారా ఇళ్లలో, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో నాణ్యమైన నెట్‌వర్క్‌ను అందిస్తున్నామని అన్నారు. ధారూరులో 120 కనెక్షన్లు లక్ష్యం కాగా ఇప్పటివరకు 88 కనెక్షన్లు ఇచ్చామని పేర్కొన్నారు. త్వరలో మండలంలోని నాగారం, కోట్‌పల్లి మండల కేంద్రంలో ఉచిత కనెక్షన్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. దశల వారీగా అన్ని గ్రామాల్లో ఉచిత కనెక్షన్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో భారత్ బ్రాడ్ బ్యాండ్ నెట్‌వర్క్ లిమిటెడ్ డీజీఎం పద్మారావు, వికారాబాద్, నార్సింగి ఎస్‌డీఓటీలు శ్రీనివాస్‌రావు, జ్ఞానేశ్వర్, వికారాబాద్ జేఈ విశ్వనాథం, టీటీ సుధాకర్, ఏటీటీలు, మీడియా సిబ్బంది పాల్గొన్నారు.



ఎఫ్ఆర్ఓ కార్యాలయాన్ని సందర్శించిన డీజీఎం జితేందర్‌సింగ్, అధికారులు

పెండింగ్ వేతనాలు చెల్లించండి

బీఆర్‌ఎస్ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు కృష్ణయ్య

- కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత

అనంతగిరి: జిల్లాలో గ్రామ పంచాయతీ ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని బీఆర్‌ఎస్ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు కృష్ణయ్య కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పలు పంచాయతీల్లో 4 నెలలుగా వేతనాలు లేక ఉద్యోగులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రమాద బీమా ఇప్పించాలన్నారు. వేతనాలను రూ. 21వేలకు పెంచేలా చూడాలన్నారు. కారోబార్‌లకు ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బోనయ్య, నర్సింలు, శ్రీనివాస్, గోపాల్, నాగరాజు, శామప్ప, హన్మంతు, గోవిందు, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కృష్ణయ్య, పంచాయతీ ఉద్యోగులు

పరిహారం ఇవ్వకుంటే ఉద్యమిస్తాం

- భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి
- వడగండ్ల వానకు దెబ్బతిన్న పంటల పరిశీలన

మర్పల్లి: వడగండ్ల వానకు పంటలు కోల్పోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని లేకుంటే ఉద్యమిస్తామని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాదిరెడ్డి రాజిరెడ్డి హెచ్చరించారు. సోమవారం మండలంలోని కొత్లాపూర్, మర్పల్లి, బూచన్‌పల్లి గ్రామాల్లో వడగండ్ల వానకు దెబ్బతిన్న పంటలను సంఘం నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పంట చేతికి వచ్చే సమయంలో అకాల వర్షాల కారణంగా రైతులు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. మర్పల్లి, మోమిన్‌పేట్ మండలంలో మామిడి, కూరగాయలు, బొప్పాయి. తర్బూజ, మల్బరీ, మొక్కజొన్న, జొన్న పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని తెలిపారు. దెబ్బతిన్న పంటల స్థానంలో కొత్తగా పంటలు సాగు చేయడానికి రైతుల వద్ద డబ్బులు లేవని తెలిపారు. ప్రభుత్వం పరిహారం అందజేస్తే కొత్త పంటలు వేస్తారని తెలిపారు. అలాగే పంట రుణాలు ఇవ్వడం తోపాటు, లక్ష లోపు పంట రుణాలను తక్షణం మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఉచితంగా వ్యవసాయ పరికరాలు, విత్తనాలు పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం కోశాధికారి మాణిక్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, కుర్మ సంఘం మండల అధ్యక్షుడు గూడెం మల్లేశ్ యాదవ్, నాయకులు సాయన్న, మల్లారెడ్డి, ఎల్ ప్రభాకర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.



మర్పల్లిలో దెబ్బతిన్న పుచ్చ పంటను పరిశీలిస్తున్న రాజిరెడ్డి తదితరులు

కాన్పు చేసే క్రమంలో కొట్టారు

- వైద్య సిబ్బందిపై బాలింత ఫిర్యాదు
- విచారణ చేపట్టిన సూపరింటెండెంట్ ప్రదీప్



వివరాలు సేకరిస్తున్న సూపరింటెండెంట్ ప్రదీప్

అనంతగిరి: కాన్పు చేసే క్రమంలో వైద్య సిబ్బంది తనను కొట్టారని ఓ బాలింత కుటుంబీకులకు తెలపగా వారు సదరు నర్సులపై సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేశారు. నవాబుపేట మండలం మూలమాడ గ్రామానికి చెందిన అనూష కాన్పు కోసం ఆదివారం వికారాబాద్ పట్టణంలోని ప్రభుత్వాసుపత్రికి వచ్చింది. సాయంత్రం ఆమెకు నార్మల్ డెలివరి జరిగింది. అయితే కాన్పు చేసే సమయంలో నొప్పులు రావడానికి సిబ్బంది తనను కొట్టారని, తొడలపై గిల్లిడం జరిగిందని బాధితురాలు తెలిపింది. సోమవారం బాధిత మహిళ బంధువులు ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన ఆస్పత్రికి చేరుకొని విచారణ చేపట్టారు. తాము గర్భిణిని కొట్టలేదని, తల్లి, బిడ్డను కాపాడే క్రమంలో ఆమె తొడ భాగాన్ని జరిపామని తెలిపారు. కొట్టామన్న దానిలో వాస్తవం లేదన్నారు. తప్పు జరిగినట్లు తేలితే చర్యలు తీసుకుంటామని సూపరింటెండెంట్ ప్రదీప్ తెలిపారు.

ఆ భూములు ఆలయానికి అప్పజెప్పాలి

- డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి
- ఎండోమెంట్ కమిషనర్‌కు వినతి

పరిగి: పూడూర్ మండలం దామగుండం రామలింగేశ్వర స్వామి భూములను ఆలయానికి అప్పజెప్పాలని సోమవారం అఖిలపక్ష నాయకులతో కలసి డీసీసీ అధ్యక్షుడు టీ రామ్మోహన్‌రెడ్డి ఎండోమెంట్ కమిషనర్ అనిల్‌కుమార్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. అటవీ ప్రాంతంలో వెలసిన అత్యంత పురాతణమైన ఆలయానికి అటవీ భూమి సర్వే నంబర్ 473, 217, 218, 219లలో 44.23 ఎకరాల భూమి ఉందని, దాన్ని దేవాదాయ శాఖ ఆధీనంలోకి తీసుకుని ఆలయాన్ని మరింత అభివృద్ధి చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేష్, ఆలయ స్వామీజీ తదితరులు పాల్గొన్నారు.



ఎండోమెంట్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న టీఆర్‌ఆర్ తదితరులు

ప్రాధాన్యత క్రమంలో సమస్యల పరిష్కారం

వికారాబాద్ అర్బన్: ప్రజావాణి కార్యక్రమానికి పట్టణ ప్రజల నుంచి 16 ఫిర్యాదులు వచ్చాయని, వాటిని ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ శరత్ చంద్ర తెలిపారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి రెవెన్యూ, ఇంజనీరింగ్, పట్టణ ప్రణాళిక, పారిశుద్ధ్య విభాగాలకు సంబంధించిన ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఈఈ సబిత, టీపీఓ శ్రీధర్, ఏఈ రాయుడు, రెవెన్యూ అధికారి శివ కుమార్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ మోహినొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

కోడ్ ముగిసినా..

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసినా నాయకుల విగ్రహాలకు వేసిన ముసుగులు తొలగడం లేదు. ఎన్నికల కోడ్ కారణంగా గత నెల 11న వికారాబాద్ పట్టణంలోని ఎన్టీఆర్, చెన్నారెడ్డి విగ్రహాలకు మున్సిపల్ అధికారులు ముసులు వేయించారు. ఈ నెల 16తో కోడ్ ముగిసింది. అయినా ముసుగులు తొలగించ లేదు. తాండూరు పట్టణంలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది.

– వికారాబాద్ అర్బన్/ తాండూరు టౌన్



వికారాబాద్, తాండురు పట్టణాల్లో ఎన్టీఆర్, రాజకీయ నాయకుడి విగ్రహాలకు వేసిన ముసుగులు



నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం

ప్రశ్నపత్రం లీకేజీకి మంత్రి బాధ్యత వహించాలి

- పీసీసీ ప్రధాన కార్యదర్శి జాదవ్ థారాసింగ్
- కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా
- ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

తాండూరు: టీఎస్‌పీఎస్సీ ప్రశ్న పత్రాల లీకేజీతో నిరుద్యోగుల జీవితాలతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని పీసీసీ ప్రధాన కార్యదర్శి జాదవ్ థారాసింగ్ ధ్వజమెత్తారు. పేపర్ లీకేజీ ఘటనపై సోమవారం పట్టణంలోని ప్రధాన కూడలిలో కాంగ్రెస్ నాయకులు ధర్నా నిర్వహించారు. అనంతరం బీఆర్‌ఎస్ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. నిరుద్యోగులు ఉద్యోగాల కోసం రాత్రింబవళ్లు కష్టపడి సిద్ధమయ్యారన్నారు. అయితే ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ప్రశ్న పత్రాలు లీకేజీ అయ్యి పరీక్షలు వాయిదా పడ్డాయని పేర్కొన్నారు. దీంతో నిరుద్యోగులు తీవ్ర మనోవేదనకు గురయ్యారని అన్నారు. గతంలో నిర్వహించిన టీఎస్‌పీఎస్సీ పరీక్షల్లో నిజామాబాద్ జిల్లాకు చెందిన ఒకే సెంటర్ నుంచి 25 మంది అభ్యర్థులకు ఉద్యోగాలు వచ్చాయని ఆరోపించారు. పేపర్ లీక్ వ్యవహారంలో ఎమ్మెల్సీ కవిత హస్తం ఉందని ఆరోపించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఉద్యోగాలు రావడం మాట అటుంచితే నిరుద్యోగులకు కష్టాలే అధికంగా ఉన్నాయని అన్నారు. ప్రశ్న పత్రాల లీకేజీలో మంత్రి కేటీఆర్ పీఏ హస్తం ఉందన్నారు. రాష్ట్ర ప్రజలకు అన్ని విధాలా అన్యాయం జరుగుతోందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే ప్రజాస్వామ్య పాలన సాగుతుందన్నారు. దొరల పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌గౌడ్, పార్టీ మైనార్టీ సెల్ జిల్లా కార్యదర్శి సమద్, ఆర్గనైజర్ జలాల్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ అలీం, మాజీ కౌన్సిలర్ పీ బస్వరాజ్, యువజన సంఘం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కావలి సంతోష్, నాయకులు జనార్దన్‌రెడ్డి, బాతుల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు